క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ కడప రోడ్డు ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో, అలాగే పట్టణంలోని 11కె.వి ఆసుపత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పుల్లారెడ్డి ఆసుపత్రి, ముద్దనూరు రోడ్డు, నగరిగుట్ట, చిన్నన్న రూములు, చెన్నారెడ్డి కాలనీ, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఉపాధి పనుల తనిఖీ


ఉపాధి పనులపై ఆరా తీస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె, బుసిరెడ్డి పల్లె గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆదిశేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులన్నీ నాణ్యతగా చేయాలని, సిమెంట్ రోడ్లు, పశువులషెడ్లు, ఫారంపాండ్‌లు త్వరగా పూర్తిచేయాలని, ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమలాపురం ఏపీడీ సోమశేఖర్, ఏపీవో రామానుజులరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

సింహాద్రిపురం : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పైడిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూముల కొలతలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్‌లో భూములు ఎక్కించుట, భూసర్వేలు తదితర వాటిపై అర్జీలను తహసీల్దార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ


దుకాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న పలు దుకాణాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై రైడింగ్ నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకం చేసే అంగళ్ళ లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకుండా ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, స్టీల్ క్యారియర్లు వాడాలన్నారు.

స్కానింగ్ సెంటర్ల పరిశీలన


స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

జమ్మలమడుగు : ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌లను వైద్యులు తల్లికడుపులో ఉన్న బిడ్డలను ఎదుగుదల కోసమే ఉపయోగించాలే తప్ప ఆడ, మగ అని తెలుసుకోవటానికి ఉపయోగించకూడదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. మంగళవారం పట్టణంలోని శంకర్, రామేశ్వరుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఉన్న స్కానింగ్ సెంటర్‌లను ఆమె పరిశీలించారు. వైద్యులు గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : పట్టణంలోని స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

డిస్ట్రిబ్యూటరీల కమిటీ చైర్మన్‌గా వెంకటలక్ష్మిరెడ్డి

వేంపల్లె : సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎన్నికలు అధికారులు నిర్వహించారు. సోమవారం పీబీసీ కెనాల్‌కు సంబంధించిన నీటి సంఘాల కమిటీ సభ్యులు అన్నారెడ్డి వెంకటలక్ష్మిరెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మలుపులు.. మృత్యు పిలుపులు


కమలాపురం మండలం లేటపల్లె వద్ద ఉన్న ప్రమాదకర మలుపు


నసంతపురం వద్ద ఉన్న ప్రమాదకర మలుపు

కమలాపురం : మండలంలోని పలు చోట్ల ఉన్న ప్రమాదకర మలుపులు మృత్యు పిలుపులుగా మారాయి. ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరిగి పలువురు గాయపడటంతో పాటు కొందరు మృతి చెందారు కూడా. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూసైనా ఇక్కడి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో పాపాఘ్నిపై నిర్మించిన కొత్త వంతెన చివరన (కమలాపురం వైపు) ఉన్న మలుపుల వద్ద అనేక రోడ్డు ప్రమాదాల జరిగాయి. గతంలో ఒక వలస కూలీల చిన్నారి రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై మృతి చెందింది. అలాగే ఏడాది క్రితం ఎద్దుల బండిని లారీ ఢీ కొని ఎద్దుల బండి యజమాని మృతి చెందాడు. ఇదే చోట చాలా మంది గాయపడి, మృతి చెందిన వారు కూడా ఉన్నారు. ఇక్కడే రోడ్డు కూడా గుంతలు పడి ధ్వంసం అవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కనీసం సూచిక బోర్డులు కూడా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కొండాయపల్లె క్రాస్, నసంతపురం క్రాస్, పాడదుర్తి, లేటపల్లె తదితర చోట్ల ఉన్న మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు గాని, సూచిక బోర్డులు గాని ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. హైవేలో కూడా సూచిక బోర్డులు లేక పోవడం దారుణం. మలుపుల వద్ద వేగంగా వెళ్లకుండా బ్రేకర్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అలాగే దెబ్బతిన్న రోడ్డును బాగుచేయాలి.

– జి.నాగేశ్వరరావు, ప్రయాణీకుడు, కమలాపురం

మలుపులతో ఇబ్బందులు



చిన్నచెప్పలి–పాడదుర్తి గ్రామాల మధ్య దాదాపు 7–8 మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద కంపచెట్లు అధికంగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించ వు. లేటపల్లె మలుపు వద్ద పలు వాహనాలు బోల్తా పడ్డా యి. అయితే అదృష్టం కొద్ది ఎలాంటి ప్రాణ నష్టం జరగలే దు. అధికారులు స్పందించి మలుపుల వద్ద కంపచెట్లు తొ లగించి, స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

–పి.చంద్రశేఖర్, ప్రయాణీకుడు

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


కళాశాల సిబ్బందితో చర్చిస్తున్న సుజ్లాన్ కంపెనీ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్

కమలాపురం : పునరుత్పాదక ఇంధన రంగంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సుజ్లాన్ కంపెనీ జనల్ మేనేజర్ సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం విద్యుత్ వాయు మిల్లు నిర్వహణలో యువతకు శిక్షణ ఇవ్వడానికి సుజ్లాన్ కంపెనీ ప్రతినిధులు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకున్నారు. విద్యుత్ వాయు మిల్లు నిర్వహణకు సంబంధించిన, శిక్షణ కేంద్రాన్ని స్థాపించేందుకు కళాశాల సిబ్బందితో చర్చలు జరిపారు. వారి అవసరాలకు తగిన విధంగా ఏర్పాట్లు చేసేందుకు కళాశాల, ఆవరణం అంతా కలియ తిరిగారు. భవనంలో అవసరమైన స్థల కేటాయింపు, శిక్షణలో ఆసక్తి కలిగిన యువత, విద్యుత్ వాయు మిల్లులో శిక్షణ ఇచ్చే సామర్థ్యంతో ఉన్న అధ్యాపకుల అందుబాటుపై చర్చించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సుజ్లాన్ సంస్థ యువతకు సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను అందించేందుకు చొరవ చూపడం హర్షణీయం అన్నారు. ప్రతిపాదిత శిక్షణ కేంద్రం, విద్యుత్, వాయు మిల్లులను నిర్వహించడం, ఆపరేట్ చేయడానికి అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ సూత్ర పరిజ్ఞానాన్ని విద్యార్థులకు సుజ్లాన్ కంపెనీ అందించనుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని రసూల్‌పల్లె, బుసిరెడ్డిపల్లెల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రీమియం డిసెంబర్ 31 లోగా చెల్లించాలని, కంది పంట వేసుకున్న రైతులు, కమోడీటీ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడితే మార్కెటింగ్ సులభంగా చేసుకోవచ్చని, కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుండి రాయితీ కూడా వస్తుందని, బోరు నీటి సౌకర్యం ఉన్న రైతులకు ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు ఎకరాలకు భూమి ఎక్కువ ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో, స్ప్రింక్లర్ పరికరాలు 50 శాతం సబ్సిడీతో ఇస్తారని కావలసినవారు ఆర్‌ఎస్కే పరిధిలోని వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు. చామంతి పంటలను పరిశీలించి మల్చింగ్ షీట్ వేసుకుని సాగు చేసినట్లయితే కలుపు, తెగుళ్లను నివారించవచ్చని పసుపు పంటకు సంబంధించి సలహాలు, సూచనలు రైతులకు ఇచ్చారు. ఉద్యాన, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

పెండ్లిమర్రి : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈనెల 27వ తేదీన పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్‌లు పరిశీలించారు. మంత్రి పర్యటనలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శన, పంటలను పరిశీలిస్తారన్నారు. అలాగే వెల్లటూరు గ్రామ పొలాల్లో రైతులు సాగుచేసిన చామంతి, వేరుశనగ, మినుము పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, ఏఓ ఓబులేసు, ఏపీఎం బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

మొదలైన క్రిస్మస్ సందడి


నిస్సీ మినిస్ట్రీస్ వద్ద క్రీస్తు చిత్రాలతో వెలుగుతున్న స్టార్

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈనెల 25వ తేదీన జరగనున్న క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైనది. వారం రోజుల ముందు నుంచే ప్రతి గ్రామంలో క్రిస్మస్ పండగ వాతావరణం మొదలైంది. ఇప్పటికే వివిధ గ్రామాల్లో వెలసిన చర్చీలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని నిస్సీ, సీఎస్ఐ, ఆర్‌సీఎం, టీసీసీ, రెహెబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యెరూషలేము చర్చీలతో పాటు రామచంద్రాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు తదితర గ్రామాలలోని చర్చీలను రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే చర్చీల ఎదుట ఏర్పాటు చేసిన స్టార్లు ప్రత్యేకత ఆకర్షణగా నిలిచాయి.

సమాజానికి పెద్దల తోడ్పాటు ఎంతో అవసరం


రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : సమాజానికి రిటైర్డు ఉద్యోగల అవసరం ఎంతైనా ఉందని ఆర్డీఓ ఆదిమూలపు సాయిశ్రీ తెలిపారు. ఆదివారం పెన్షనర్స్ డే సందర్భంగా ఆర్డీఓ కార్యాల సభా భవనంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు దేవదానం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దలు పిల్లలకు క్రమశిక్షణ, విలువలను నెర్పించటానికి కుటుంబంలో పెద్దల పాత్ర ఎంతో ఉందన్నారు. కుటుంబ విలువలు నేటి తరానికి సక్రమంగా తెలియకపోవచ్చు వాటిని పెద్దలు వివరించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఉపఖజనాధికారి సతీష్‌లు ప్రసంగించారు. అనంతరం రిటైర్డు ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రెటరీ రామచంద్రారెడ్డి, కోశాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిగొట్లలో రెవెన్యూ సదస్సు


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్లలో మంగళవారం గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుండి ఏపీఐఐసీ భూములు గురించి, మిగులు భూములు, మ్యుటేషన్ పైన ఇరవై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సదస్సులో తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. బుధవారం కొప్పర్తి గ్రామానికి సంబంధించిన భూ సమస్యలపై కొప్పర్తి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

చెన్నూరులో...

వల్లూరు (చెన్నూరు) : ఉప్పరపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వానికి అందుతున్న వినతులలో ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించిన వినతులే అందుతున్నాయన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి భూసమస్యలను తెలుసుకోవాలన్నారు. వచ్చిన భూ సమస్యలను 45 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, వీఆర్వో, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యం


వేంపల్లెలో శిక్షణ తరగతులలో ఏపీఎస్ఐఆర్డీ భార్గవి, తదితరులు


కమలాపురంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ఓబులమ్మ


ముద్దనూరు : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

వేంపల్లె : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ కోసం ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళికతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసినప్పుడే సాధ్యమవుతుందని ఏపీఎస్ఐఆర్డీ అబ్జర్వర్ భార్గవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి స్థానికీకరణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి 9 మానవ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నామని, ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి మెరుగైన సౌకర్యాలు కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలన, ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, లింగ అసమానత్వం రూపుమాపడం వంటి లక్ష్యాలను అమలు చేయాలన్నారు. ఈ లక్ష్య సాధన కోసం క్షేత్ర స్థాయిలోకి పటిష్టంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళాయమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ర్ణలత, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని జడ్పీ సీఈఓ ఓబులమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గ్రామాల సుస్థిరాభివృద్ధిపై జరుగుతున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యాలను సాధిస్తే సుస్థిరాభివృద్ధి సాధించవచ్చన్నారు. ముందుగా మహిళలకు బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించాలన్నారు. అలాగే రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించి భూమి ఉత్పాదకతను మెరుగు పరచాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వం 9 అంశాలతో కూడిన లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. వాటిని సాధిస్తే సుస్థిరాభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ పలు అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం రెండవ విడత నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేయాలని మండలస్థాయి అధికారులకు సూచించారు. ప్రతి కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపీఎం బాగ్యమ్మ, ఈఓపీఆర్డీ పులిరామ్ సింగ్, ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సభా భవనంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలలో చేపట్ట బోవు అభివృద్ధిపై ఇతర అంశాలపై సర్పంచ్‌లకు పూర్తిగా శిక్షణ ఇవ్వడానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యాదర్శి ఓబులమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : అధికారులు, సిబ్బంది కలసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీయల్‌పీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి, శుభ్రం చేసిన తేదీలను ట్యాంకులపై పొందుపరచాలని ,ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావాలని, శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ముకుందరెడ్డి, మాట్లాడుతూ అన్ని రంగాల్లో పంచాయతీల అభివృద్ధికి కష్టపడి పనిచేయాలన్నారు. మండల పీఆర్ విస్తరణాధికారి వీరభద్రుడు, పంచాయతీ ఈవో నరసింహులు, రీసోర్స్‌పర్సన్ పుల్లారెడ్డిలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ప్రతి రైతు పంటల సాగుకు ముందు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జంభాపురం, గొల్లపల్లె గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులందరూ పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలన్నారు. అప్పుడు తగిన మోతాదులో ఎరువులు వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మినుము, శనగ పంటలలో జిగురు అట్టల, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేస్తే రసం పీల్చే పురుగుల ఉధృతిని, లద్దెపురుగు, శనగ పచ్చ పురుగు నివారణకు దోహద పడతాయన్నారు. మండల ఏఓ సరస్వతి మాట్లాడుతూ జీవ నియంత్రణ కారకాలైన ట్రైకోడెర్మా విరిడి, సుడోమోనాస్ వాడకం వలన భూమికి సంబంధించిన తెగుళ్ల నివారణకు దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి


పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద కరెంటు బిల్లులు పెంపుపైన నిరసన వ్యక్తం చేయడంతో పాటు కరెంటు బిల్లులను కాల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం వస్తే నాణ్యమైన కరెంటు ఇవ్వడంతో పాటు కరెంటు బిల్లులను పెంచబోమని ప్రకటించారు. అయితే ఆరునెలల కాలంలోనే ట్రూఆఫ్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. జిల్లాలో పదిలక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. విద్యుత్ బిల్లులపై ప్రతి ఇంటికి 60 నుంచి 120 రూపాయల అదనంగా చార్జీలను వసూలు చేయడం జరుగుతుంది. రాబోయే ఎండల కాలంలో ఈ ట్రూఆఫ్ చార్జీలు మరింత ఎక్కువగా పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో భారీగా అదనపు భారం మోపుతుందన్నారు. వెంటనే ట్రూఆఫ్ చార్జీల వసూలు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక నాయకులు పల్లా లక్ష్మీనారాయణ, చంటి, కృష్ణ, నారాయణ, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో విధులు నిర్వహించాలి


సంజామలమోటులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని విద్యుత్ శాఖా జిల్లా ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం ఆయన ట్రాన్స్‌కో అధికారులతో కలసి జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో పర్యటించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పట్టణంలోని డీఈ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చూడలన్నారు. వినియోగదారులకు 2 నెలలు గడువు ఇస్తున్న తాత్సారం చేస్తున్నారాన్నారు. అటువంటి వారు ఎవరైన ఉంటే కరెంట్ కనెక్షన్ తొలగించాలని సూచించారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో రూ.68 కోట్ల డెబ్బై తొమ్మిది లక్షల రూపాయలు విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ సకాలంలో చెల్లించే విధంగా చూడలన్నారు. విద్యుత్‌లో లో ఓల్టేజి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

మా భూములను ఇప్పించండి


అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హరినాథరెడ్డి

వేంపల్లె : మా భూములను మాకు తిరిగి ఇప్పించాలని కొంతమంది రైతులు తహసీల్దార్ హరినాథరెడ్డికి అర్జీల ద్వారా కోరారు. మంగళవారం మండలంలోని పాములూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపల్లె గ్రామానికి చెందిన రామలింగారెడ్డి, బయపురెడ్డిలు కొంతమంది రైతులతో కలిసి రిటైర్డ్ వీఆర్‌ఓ చిన్న నాగసుబ్బారెడ్డిపై ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. నందిపల్లె, కత్తులూరు గ్రామాల్లోని రైతులకు పాములూరు పొలంలో పట్టా భూములు ఉన్నాయని, సర్వే నెంబరు 167/1లో 0.47 సెంట్ల భూమిని రిటైర్డ్ వీఆర్‌ఓ నాగసుబ్బారెడ్డి ఆన్‌లైన్ చేసుకోవడంతో పదేళ్ల నుండి ప్రభుత్వం నుండి రావాల్సిన పథకాలు రావడం లేదన్నారు. పూర్వం మా పెద్దలు సంపాదించిన భూములు పాములూరు పొలంలో ఉన్నాయని, తమ అనుభవంలో ఉన్న భూములను దొంగ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడం జరిగిందని, కాబట్టి ఆన్‌లైన్‌లో తొలగించి తమ పేర్లతో ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. అలాగే తమ భూమికి 2007 వరకు అడంగల్ వచ్చిందని, తర్వాత అడంగల్ రావడం లేదని పాములూరుకు చెందిన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 80/8లో 30 సెంట్లు, 86/4 లో 29 సెంట్ల భూమి అయ్యవారిపల్లి చెందిన రామసుబ్బమ్మ పేరుతో అడంగల్ వస్తోందన్నారు. అనంతరం పలువురు రైతులు భూములకు చెందిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అలాగే ఉపసర్పంచ్ మధు ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామగంగిరెడ్డిలు పాములూరు గుట్ట సమీపంలో కొందరు వ్యక్తులు గుట్టను చదును చేసుకోవడంతో ఆ ప్రాంతం అన్యాక్రాంతానికి గురవుతోందని తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. దొంగ డాక్యుమెంట్లతో ఇతర భూములను ఎక్కించుకొన్న రిటైర్డ్ వీఆర్‌ఓ చిన్న నాగసుబ్బారెడ్డిని కూడా పిలిపించి ఆయన వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి నిజమైన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సదస్సులో మండల సర్వేయర్ గంగయ్య, ఆర్ఐ లోకేష్‌తోపాటు వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.